
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 3 । ఫిబ్రవరి । 2024



గిరి గ్రామాల అభివృద్ధికి కృషి
గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం, పోలీసుశాఖ కృషి చేస్తోందని చింతపల్లి ఏఎస్పీ ప్రశాంత్ శివకిషోర్ తెలిపారు. 8లో



కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం
విశాఖ నగరంలోని బురుజుపేటలో వెలసిన కనమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. 8లో



అలలపై తేలియాడే వంతెన!
విశాఖ నగరంలోని రామకృష్ణాబీచ్ వద్ద సముద్రంలో తేలియాడే వంతెన సిద్ధం అవుతోంది. 8లో

పింఛను ఇస్తూ.. ధైర్యం నింపుతూ..

సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు భరోసా నిస్తోంది. నెలకు రూ.10వేలు పింఛను అందజేస్తూ ధైర్యం నింపుతోంది. జీవనోపాధికి ఆసరా కల్పించడంతో బాధితుల్లో ఆనందం నెలకొంది. రక్తహీనతతో బాధపడుతున్న వారికి పౌష్టికాహారంతో పాటు సత్వర వైద్యం అందిస్తోంది.

- సికిల్‌సెల్ ఎనీమియా బాధితులకు భరోసా
- రూ.10 వేలతో పాటు సత్వర వైద్యం
- రక్తహీనత నివారణపై దృష్టి సారించిన ప్రభుత్వం

ముంచంగిపుట్టు: జిల్లాలో 22 మండలాల్లో సుమారు 829 మంది సికిల్ సెల్ ఎనీమియా బాధితులు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వీరికి రూ.10 వేల చొప్పున పింఛను అందజేస్తూ కొండంత అండగా నిలుస్తోంది. గత ప్రభుత్వాలు వీరి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించాయి. దీంతో ఎటువంటి ఆసరా లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురయ్యేవారు. వైద్యసేవల పరిస్థితి అంతంతమాత్రమే.మందులు కొనుక్కోలేక.. కుటుంబం నుంచి పూర్తిస్థాయిలో సహకారం అందక లోలోపల కుమిలిపోయేవారు. వీరి సమస్యను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటోంది. ప్రస్తుతం అందిస్తున్న రూ.10 వేల పింఛను సొమ్మును పౌష్టికాహారం, మందులకు ఉపయోగిస్తున్నారు. ప్రతినెలా వీరి పరిస్థితిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది అవరమైన ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. మార్పులకు అనుగుణంగా అవసరమైన చికిత్స అందిస్తున్నారు. అవసరమైతే ఆస్పత్రికి తరలిస్తున్నారు. హిమోగ్లోబిన్ స్థాయి తక్కువగా ఉంటే వెంటనే రక్తం ఎక్కించి మెరుగైన వైద్యం అందిస్తున్నారు.

పాఠశాలలు, కళాశాలల్లో..
గ్రామాలు, పాఠశాలలు, కళాశాలల్లో రక్తహీనత ఉన్న వారిని ముందుగానే వైద్యసిబ్బంది ముందుగానే గుర్తిస్తున్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా పంచాయతీ పరిధిలో ఉన్న ఉన్న పాఠశాలలు ,కళాశాలలకు వెళ్లి విద్యార్థులకు హెచ్‌బీ టెస్టులు చేస్తున్నారు.హెచ్‌బీ స్థాయి తక్కువగా లున్న విద్యార్థులకు ఐరన్ మందులు అందిస్తున్నారు. ఎప్పటికప్పుడు వీరిపై వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ వైద్యం అందిస్తున్నారు.



పాఠశాల విద్యార్థులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నెలలో 25 రోజులు..
గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో రక్తహీనత, బరువు తక్కువ ఉన్నవారికి నెలలో 25 రోజుల పాటు పౌష్టికాహారం ప్రభుత్వం అందిస్తోంది. రోజుకు గుడ్డు, 200 మిల్లీ లీటర్ల పాలు, మధ్యాహ్న భోజనంతో పాటు నెలలో మొదటి వారం రెండు కిలోల గోధుమ పిండి, రెండో వారంలో 500 గ్రాముల వేరుశనగతో తయారు చేసిన చెక్కిలు, మూడో వారంలో 500 గ్రాముల రాగిపిండి, 500 గ్రాముల బెల్లం, నాల్గవ వారంలో 500 గ్రాముల నువ్వుల లడ్డూను సరఫరా చేస్తోంది. దీంతో మన్యంలో రక్తహీనత సమస్య తగ్గుముఖం పడుతోంది.

మండలాల వారీగా బాధితులిలా..
జిల్లాలో అనంతగిరి మండలంలో 16, అరకులో 78, డుంబ్రిగుడలో 44, హుకుంపేటలో 52, ముంచంగిపుట్టులో 126, పెదబయలులో 88, కొయ్యూరులో 55, పాడేరులో 46, జి.మాడుగులలో 31, చింతపల్లిలో 91, జీకేవీధిలో 74, రంపచోడవరంలో 28, మారేడుమిల్లిలో 14, వై.రామవరంలో 12, అడ్డతీగలలో 9, రాజవొమ్మంగిలో 16, కూనవరంలో 9, చింతూరులో 15, వీఆర్‌పురంలో 8, ఎటపాకలో 6 మంది ఉన్నారు. వీరంతా ప్రభుత్వం నుంచి పింఛను పొందుతున్నారు.



సికిల్ సెల్ ఎనీమియా బాధితురాలికి పింఛను అందిస్తున్న వలంటీర్

పూట గడవడానికే కష్టంగా ఉండేది



రూ.10 వేల పింఛను ఇవ్వకముందు గత ప్రభుత్వంలో జీవనోపాధికి ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. పూట గడవడానికే కష్టంగా ఉండేది. పింఛన్ రావడంతో ఆర్థిక భరోసా లభించింది. వైద్య సేవలు సైతం చాలా బాగా అందిస్తున్నారు. ఎప్పటికి అప్పుడు రక్త పరీక్షలు చేసి హెచ్‌బీ శాతం తెలియజేస్తూ మందులు ఇస్తున్నారు. మా ఆరోగ్య పరిస్థితిలో ఎటువంటి తేడాలు కనిపించిన వెంటనే వైద్యం అందుతోంది.
– రంగి తులమ్మ, సికిల్‌సెల్ బాధితురాలు,కించాయిపుట్టు

ఇంటి వద్దకే వైద్యం



పుట్టుకతోనే రక్తహీనతతో బాధ పడుతున్నా.ఈ వ్యాధితో చాలా మంది మా గ్రామంలో గతంలో మృత్యువాత పడ్డారు. సరైన వైద్యం అందక, పౌష్టికాహార లోపంతో ఇబ్బందులు పడుతూ వచ్చాం.ప్రభుత్వం పింఛను ఇవ్వడమే కాకుండా వైద్య సిబ్బందిని ఇంటికి పంపించి వైద్యం అందిస్తోంది.
– కోడా సునీత, సికిల్ సెల్ ఎనీమియా బాధితురాలు, చెరువుపాకల, ముంచంగిపుట్టు మండలం

బాధితులకు సంపూర్ణ సేవలు



సికిల్ ఎనీమియా బాధితులకు ప్రతి నెలా సంపూర్ణంగా వైద్య సేవలు అందిస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, పాఠశాలల్లో విద్యార్థులకు హెచ్‌బీ టెస్టులు చేసి రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి సరైన పౌష్టికాహారం, మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం.అధికంగా 15 ఏళ్లలోపు వారు రక్తహీనతతో బాధపడుతున్నారు.వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.
– జమాల్‌బాషా, డీఎంహెచ్‌వో, పాడేరు

న్యూస్‌రీల్

'సిద్ధం' సభకు ఇలా వెళ్లండి

అడ్డతీగల: ఏలూరు జిల్లా దెందులూరులో నిర్వహించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సిద్ధం సభకు తరలి వెళ్లే పార్టీ శ్రేణులు రూట్ మ్యాప్‌ను అనుసరించాలని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి,ఎమ్మెల్సీ అనంత బాబు సూచించారు. ఈ సభకు రంపచోడవరం నియోజకవర్గం నుంచి సిద్దం సభకు వెళ్లే శ్రేణులు కొంతమూరు, కొవ్వూరు, గౌరీపట్నం, బండాపురం, యర్నగూడెం, అనంతపల్లి, నల్లజర్ల, పుల్లలపాడు, దూబచర్ల మీదుగా వెళ్లాలని కోరారు. గంటవారిగూడెం వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు తీసుకోవాలని సూచించారు. దూబచర్ల దాటిన తరువాత వంతెన వస్తుందని అక్కడి నుంచి ఎడమ వైపునకు మూడు కిలోమీటర్లు వెళితే భోజన ప్రదేశం గంటవారిగూడెం వస్తుందన్నారు. భోజనాలు ఏర్పాటు చేసిన ప్రాంతంలో తోట రాజేశ్వర్రావును 9441142939),మద్దాల వీర్రాజును 7780556622, కిట్టును 6281668847,అనిల్‌ను 6281560944 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

మోతుగూడెంలో పర్యటించిన ఎస్సీ కమిషన్ చైర్మన్



డొంకరాయి జలాశయాన్ని సందర్శించిన ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్

మోతుగూడెం: లోయర్ సీలేరు మోతుగూడెంలో శుక్రవారం రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం .విక్టర్ ప్రసాద్ పర్యటించారు. ఆయనను ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్, జెన్‌కో ఉన్నతాధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఏపీ జెన్‌కో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘ ప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన మోతుగూడెం జల విద్యుత్ కేంద్రంతో పాటు ఫోర్ బై, డొంకరాయి జలాశయాలను ఆయన సందర్శించారు. అనంతరం స్థానిక విలేకరులతో విక్టర్ ప్రసాద్ మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఉపయోగపడే ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించి అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు ఆంగ్ల మీడియంను పేదలకు అందుబాటులోకి తెచ్చారన్నారు.

ఉపాధ్యాయ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

ముంచంగిపుట్టు: మండల కేంద్రం ముంచంగిపుట్టులో గల ఆదివాసీ విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులకు ఉచిత కోచింగ్ అందిస్తామని ఆ సంస్థ ప్రతినిధి బి.బాబూరావు తెలిపారు. డీఎస్సీ నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో ముంచంగిపుట్టు,పెదబయలు మండలాలకు చెందిన గిరిజన యువతీ,యువకులకు ఈ నెల 7వ తేదీనుంచి ఉచితంగా కోచింగ్ ఇస్తామన్నారు. స్థానిక ఇంజనీరింగ్ కార్యాలయం వద్ద ఉన్న ఆదివాసి విద్యా ఫౌండేషన్ భవనంలో ఈ కార్యక్రమం ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9014746943 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

లైంగిక వేధింపుల కేసు విచారణ

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి ఉన్నత పాఠశాలలో గత ఏప్రిల్‌లో చోటుచేసుకున్న విద్యార్థినులపై లైంగిక వేధింపుల కేసుకు సంబంధించి శుక్రవారం సమగ్రశిక్ష అభియాన్ ఏడీ వినయ్‌మోహన్ విచారణ నిర్వహించారు. ప్రత్యేక తరగతులు జరుగుతున్న సమయంలో పాఠశాలకు చెందిన ఐదుగురు ఉపాధ్యాయులు విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించినట్టు ఓ స్వచ్ఛంద సంస్థ ఉన్నాతాధికారుల దృష్టికి అప్పటిలో తీసుకువెళ్లింది. దీంతో ఐదుగురి ఉపాధ్యాయులపై కేసు నమోదైంది. వారిని సస్పెండ్ చేయడంతోపాటు అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో విచారణలో భాగంగా బాధిత విద్యార్థినుల వాంగ్మూలాన్ని ఏడీ తీసుకున్నారు. దీనికి సంబంధించి నివేదికను ఆర్‌జేడీకి సమర్పిస్తామని ఆయన పేర్కొన్నారు. డీవైఈవో చెల్లయ్య, ఎంఈవో సూరయ్యరెడ్డి పాల్గొన్నారు.

ఐదుగురు విద్యార్థులకు అస్వస్థత

రంపచోడవరం: డివిజన్‌కేంద్రమైన రంపచోడవరంలోని గిరిజన వికాస కేంద్రంలో ఒకటో తరగతి చదువుతున్న ఐదుగురు విద్యార్థులు మరుగుదొడ్డిలో వాడే రసాయనాలు తాగడంతో అస్వస్థతకు గురయ్యారు. రంపచోడవరం సాయిబాబా గుడి ఎదురుగా ఉన్న జీవీకే ప్రైవేట్ పాఠశాలలో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. మధ్యాహ్న భోజనం చేసిన తరువాత వారు పాఠశాల ఆవరణలోని మరుగుదొడ్డి వద్ద ఉన్న ఫినాయిల్ తాగి, యాసిడ్ పౌడర్ తినడంతో అస్వస్థతకు గురయ్యారు. వారు ఒక్కసారిగా కేకలు వేయడంతో అప్రమత్తమైన ఉపాధ్యాయులు రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో సింహాద్రి సత్యనారాయణ, లలిత్‌ను రాజమహేంద్రవరం రిఫర్ చేశారు. మోక్షిత, హరిప్రియ, తన్విక్ కోలుకోవడంతో ఆస్పత్రినుంచి డిశ్చార్జ్ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. కె లక్ష్మి పర్యవేక్షణలో చిన్నారులకు వైద్య సేవలు అందించారు. రాజమహేంద్రవరం రిఫర్ చేసిన ఇద్దరు ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉందని, శనివారం డిశ్చార్జి చేస్తారని పాఠశాల యాజమాన్యం తెలిపింది.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న చింతపల్లి అదనపు ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్

చింతపల్లి రూరల్: చింతపల్లి కేంద్రంగా ఈ నెల 6 తేదీన వైటీసీలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఏఎస్పీ ప్రతాప్ శివకిశోర్ సూచించారు. ప్రేరణ కార్యక్రమంలో భాగంగా ఎస్పీ తుహిన్‌సిన్హా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళా వివరాలను ఆయన వెల్లడించారు. టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు ఈ మేళాలో పాల్గొంటున్నట్టు చెప్పారు. ఇంటర్ పాసై 30 ఏళ్ల లోపు యువతీ యువకులు అర్హులన్నారు. అన్ని కులాలు వారు హాజరు కావచ్చాని తెలిపారు. అర్హత కలిగిన వారు ఆధార్‌కార్డు, టెన్త్ లేదా ఇంటర్ లేదా ఆపై విద్యార్హతకు సంబంధించిన ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు సంబంధిత పోలీసుస్టేషన్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సీఐ రమేష్, ఎస్‌ఐ అరుణ్ కిరణ్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు తప్పనిసరి

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

సాక్షి, పాడేరు: జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన రంపచోడవరం, పాడేరు, అరకులోయ నియోజకవర్గాల ఎన్నికల అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్లు, బూత్ లెవెల్ అధికారులతో మండలాల వారీగా సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించి సమస్యలను గుర్తించడంతోపాటు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు సిమెంట్ ర్యాంప్‌లు, మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు కల్పించాలన్నారు. జిల్లాలోని ముగ్గురు అధికారులకు ఒకొక్కరికి రూ.2.50 లక్షల చొప్పున నిధులు విడుదల చేస్తున్నామన్నారు. ఈ నిధులతో ఈనెల 10వతేదీ నాటికి ర్యాంపుల నిర్మాణం, 15వతేదీ నాటికి మరుగుదొడ్ల నిర్మించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియపై అవగాహన పొందాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమెరాల ఏర్పాటుకు ఏఎస్పీలతో చర్చించాలని ఆయన సూచించారు.



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఆదేశాలు పక్కాగా అమలు
ఎన్నికల కమిషన్ ఆదేశాలను జిల్లాలో పక్కాగా అమలుజేయాలని రెవెన్యూ యంత్రాంగాన్ని కలెక్టర్ ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు బదిలీపై వచ్చిన అధికారులు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎటువంటి రాజకీయ ఒత్తిడిలు, ఇతర సమస్యలు ఉండవన్నారు. కమ్యూనికేషన్ పరంగా సిగ్నల్ సమస్య కొన్ని చోట్ల ఉందన్నారు. గిరిజనులతో అధికారులు సౌమ్యంగా, మంచిగా వ్యవహరించాలని సూచించారు. కొత్తగా వచ్చిన అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించాలన్నారు. ఓట్లను తొలగిస్తే జిల్లా ఎన్నికల అధికారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జిల్లాలో ఉత్సాహవంతులైన డిప్యూటీ తహసీల్దార్లు ఉన్నారని, వారితో కలిసి ఎన్నికల విధులు విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన విశిష్ఠ, పాడేరు,రంపచోడవరం ఐటీడీఏ పీవోలు అభిషేక్, సూరజ్ గనోరే, డీఆర్వో వీవీ.రమణ, ఎస్‌డీసీలు శర్మ, అంబేద్కర్ పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతి పరిరక్షణ అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న యాత్ర ప్రముఖ్ మహంత్ నాగేశ్వరరావు

దేవరాపల్లి: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు గిరిజనుల హక్కులను కాపాడటం అందరి బాధ్యత అని యాత్ర ప్రముఖ్ మహంత్ ఉబ్బేటి నాగేశ్వరరావు అన్నారు. విజయనగరం కేంద్రీయ విశ్వ విద్యాలయం , ఆంధ్రప్రదేశ్ వనవాసీ కల్యాణ్ ఆశ్రమ్ సంయుక్త ఆధ్వర్యంలో 'తూర్పు కనుమలలో గిరిజన సాంస్కృతిక యాత్ర' పేరిట జైపూర్ నుంచి విశాఖపట్నం వరకు నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని చింతలపూడి పంచాయతీ సమ్మెదలో సమావేశం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ దొమ్మంగి బోడెమ్మ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి పునరుద్ధరణ తదితర అంశాలపై యాత్ర ప్రముఖ్ నాగేశ్వరరావు వివరించారు. గిరిజన సంస్కృతి, జీవన శైలి ఔన్నత్యాన్ని చాటి చెప్పి గిరిజనుల్లో ఆత్మ గౌరవం పెంపొందించడమే ఈ యాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దొమ్మంగి బోడెమ్మ, మాజీ ఎంపీటీసీ బి. సన్యాసమ్మ, స్థానిక గ్రామ పెద్దలు, గిరిజన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జగనన్నతోనే సుపరిపాలన

- వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ సమన్వయకర్త విశ్వేశ్వరరాజు
- టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పార్టీలో చేరిక
- వారికి కండువాలు వేసి ఆహ్వానం

జి.మాడుగుల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనకు ఆకర్షితులై వివిధ పార్టీల నేతలు వైఎస్సార్‌సీపీ చేరేందుకు క్యూ కడుతున్నారని ఆ పార్టీ పాడేరు అసెంబ్లీ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు పేర్కొన్నారు. మండలం వంజరి పంచాయతీలోని గొందిమెలక, చింతలపాడు,పద్మాపురం, భూసుపల్లి, తోకచిలుక, డింబురుపాడు, డిప్పలమెట్ట, బద్దిమెట్ట, సరియా, గొప్పులపాలెం గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కొర్రా అప్పారావు,సారే బాలబాబు, కొర్రా మోహన్ రావు, వంతాల రాము, పాంగి ఆనందరావు, కొర్రా లక్ష్మణరావు, జగ్గందొర రాంబాబు, గల్లెల రామూర్తి, కొర్రా రమేష్, కిల్లో బుజ్జిబాబు, కిల్లో సన్యాసిరావు, జగ్గందొర చైతన్య తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఎస్ రామకృష్ణ, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ మాజీ ప్రధాన కార్యదర్శి కూడా సురేష్‌కుమార్, ఎంపీటీసీలు గబ్బాడి సన్యాసిదొర, చిన్నారావు, చిట్టిబాబు, అచ్చిబాబు, అప్పారావు, నాగమణి, మాజీ సర్పంచ్ సీతారాంనాయుడు, లంబసింగి సర్పంచ్ రఘునాథ్ పాల్గొన్నారు.



గొందిమెలకలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గ కన్వీనర్ విశ్వేశ్వరరాజు

అభయారణ్యాన్ని విడిచి వస్తే ఆదుకుంటాం

ఇజ్జలూరు గిరిజనులకు అధికారుల భరోసా

మారేడుమిల్లి : మండలంలోని జీఎంవలస పంచాయతీ పరిధిలోని మారుమూల ప్రాంతమైన ఇజ్జలూరు గ్రామాన్ని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్, డీఎఫ్‌వో జీజీ. నరేంద్రన్ శుక్రవారం సందర్శించారు. తమకు రహదారి సౌకర్యంతో సమీప ప్రాంతంలో ఇళ్లు నిర్మించి ఉపాధి కల్పిస్తే ఆ ప్రాంతానికి వచ్చేస్తామని ఆ గ్రామ గిరిజనులు ఇటీవల ఐటీడీఏ పీవోను కలిసి విన్నవించారు. ఈమేరకు పీవోతో కూడిన అధికారుల కాలినడకన ఆ గ్రామానికి వెళ్లింది. అక్కడి గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా పీవో గనోరే మాట్లాడుతూ ఇజ్జలూరులో 12 కుటుంబాలు ఉన్నాయన్నారు. ఈ గ్రామం మొత్తం అభయారణ్యంలో (వైల్డ్ లైఫ్ నేషనల్ పార్కు) పరిధిలో ఉన్నందున ఇక్కడ మౌలిక సదుపాయాలు కల్పించడం అసాధ్యమన్నారు. అందువల్ల ఇక్కడి గిరిజన కుటుంబాలు తమకు సహకరించి బయటకు రావాలని కోరారు. 12 కుటుంబాలకు స్థల పట్టాలు ఇచ్చి ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు. అదేవిధంగా నేషనల్ పార్క్ అటవీశాఖ నిబంధనల ప్రకారం కొంత మేర నష్టపరిహారం ఇస్తారన్నారు. వ్యవసాయం చేసుకునే విధంగా భూమి కూడా ఇచ్చి, అన్ని విధాల సహాయ సహకరాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వలంటీర్ పల్లాల సూర్యనారాయణ రెడ్డి, ఆశవర్కర్ సాదల వెంకటలక్ష్మి అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



ఇజ్జలూరు గిరిజనులతో మాట్లాడుతున్న పీవో సూరజ్ గనోరే, సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, డీఎఫ్‌వో నరేంద్రన్

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

దాబాగార్డెన్స్(విశాఖ): బురుజుపేటలో వెలసిన కనమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ఈ ప్రత్యేక పూజలో రూ.1,000 చెల్లించిన దంపతులు లేదా ఇద్దరు భక్తులను అనుమతించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఈవో కె.శిరీష, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మిరియాలను అధిక ధరకు విక్రయించండి

- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: మిరియాలకు మార్కెట్‌లో అత్యధిక డిమాండ్ ఉన్నందున గిరిజన రైతులంతా మంచి ధరతో విక్రయించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఏజెన్సీలో మిరియాలకు నాణ్యతలో జాతీయంగా పేరుందన్నారు. చిక్మగలూరు, మడిగిరి, ఇడుక్కి, మంగళూరు, పుత్తూరు,గోవా,కొచ్చిన్ ప్రాంతాలలో మిరియాలు కిలో రూ.560 నుంచి రూ.600ధర పలుకుతుందన్నారు. ఈ పరిస్థితిలలో గిరిజన రైతులు కనీస ధర కంటే అధిక ధరతో మిరియాలు అమ్ముకోవాలని సూచించారు. తెల్ల మిరియాలు కిలో రూ.685 ధర ఉందన్నారు.ఏజెన్సీలో మిరియాల రైతులకు అన్ని విధాల ప్రోత్సాహం అందిస్తున్నామని, రైతులకు మిరియాలు వలిచి శుభ్రపరిచే యంత్రాలను 75శాతం రాయితీపై అందిస్తున్నామని పేర్కొన్నారు. తగిన సలహాలు, సూచనలు, రాయితీల సమాచారం కోసం స్పైసెస్ బోర్డు అధికారులను సంప్రదించాలని ఆయన కోరారు.

ఉత్సాహంగా..ఉల్లాసంగా

- ముగిసిన ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీలు
- రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన ఐదు జట్లు


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన అరకులోయ క్రికెట్ జట్టు

పాడేరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీలు పాడేరు ప్రభుత్వం జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం ఘనంగా ముగిశాయి. జిల్లాలోని పాడేరు, అరకువేలి, రంపచోడవరం నియోజకవర్గాల నుంచి ఐదు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో అర్హత సాధించిన జట్లు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాయి.

క్రికెట్ పోటీల్లో : జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో పాడేరు, అరకు, రంపచోడవరం నియోజకవర్గాల నుంచి మూడు జట్లు జిల్లా స్థాయిలో తలపడ్డాయి. వీరిలో పాడేరు, అరకు జట్ల మధ్య శుక్రవారం ఫైనల్ పోటీ జరిగింది. ఇందులో అరకు జట్టు విజేతగా నిలిచింది. పాడేరు రన్నరప్‌గా నిలిచింది. రంపచోడవరం జట్టు మూడో స్థానంలో నిలిచింది.

వాలీబాల్ పోటీల్లో : పురుషులు, మహిళల వాలీబాల్ పోటీల్లో పాడేరు జట్టు ప్రథమ స్థానంలో. రెండో స్థానంలో రంపచోడవరం, మూడో స్థానంలో అరకు జట్లు నిలిచాయి.

కబడ్డీ : కబడ్డీ క్రీడల్లో మహిళల విభాగంలో పాడేరు జట్టు, పురుషుల విభాగంలో రంపచోడవరం జట్టు ప్రథమ స్థానంలో, రెండో స్థానంలో పురుషుల, మహిళల విభాగాల్లో అరకు జట్టు, మూడు స్థానంలో పురుషుల, మహిళల విభాగాల్లో రంపచోడవరం జట్లు నిలిచాయి.

ఖోఖోలో : ఖోఖో క్రీడల్లో పురుషుల విభాగంలో రంపచోడవరం, మహిళల విభాగంలో రంపచోడవరం జట్లు ప్రథమ స్థానంలో, రెండో స్థానంలో పురుషుల విభాగంలో పాడేరు జట్టు , మూడో స్థానంలో పురుషుల, మహిళల విభాగాల్లో అరకులోయ జట్లు నిలిచాయి.

బ్యాడ్మింటన్‌లో : షటిల్ బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో పాడేరు, మహిళల విభాగంలో రంపచోడవరం జట్లు ప్రథమ స్థానంలో, పురుషుల రెండో స్థానంలో రంపచోడవరం, మహిళల విభాగంలోఅరకులోయ జట్టు, పురుషుల మూడో స్థానంలో అరకులోయ, మహిళల విభాగంలో పాడేరు జట్టు నిలిచింది. ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన జట్లకు నిర్వాహకులు ట్రోఫీలను బహూకరించారు.

ఆక్రమిత భూముల్లో గుడిసెల తొలగింపు


ఎటపాకలో తొలగించిన గుడిసెలు


సూచనలిస్తున్న చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా

ఎటపాక: మండల కేంద్రం ఎటపాకలో ఆక్రమిత భూముల్లో ఆదివాసీలు నిర్మించిన గుడిసెలను శుక్రవారం తొలగించారు. ఎటపాక పంచాయతీ పరిధిలోని లక్ష్మీదేవిపేట, మేడువాయి ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న భూముల్లో గత ఏడాది విలీన మండలాల నుంచి వచ్చిన ఆదివాసీలు సుమారు 600కు పైగా గుడిసెలు వేసుకున్నారు. అయితే సుమారు 70 ఎకరాల భూములకు తమకు పట్టాలు ఉన్నాయని, ఆక్రమించిన గుడిసెలను తొలగించాలని కోరుతూ భూహక్కుదారులు కోర్టును ఆశ్రయించారు. దీంతో గుడిసెల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోర్టునుంచి ఆదేశాలు అందాయని తహసీల్దార్ పృథ్వీ తెలిపారు. ఈ మేరకు గతంలో రెండు సార్లు నోటీసులు ఇచ్చామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గుడిసెల తొలగింపు చేపట్టామని ఆయన పేర్కొన్నారు. ఇలావుండగా ఆదివాసీ బాధిత మహిళలు మాట్లాడుతూ ఆదివాసీ సంఘాల నేతల సూచన మేరకు గుడిసెలు నిర్మించుకున్నామని చెప్పారు. కాలనీలో సౌకర్యాలు, ఇంటి పట్టాల నిమిత్తం ఒక్కో ఇంటికి రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు వారికి చెల్లించామన్నారు. ఇలావుండగా గుడిసెల తొలగింపు సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు, సీఆర్పీఎఫ్ బలగాలు బందోబస్తు నిర్వహించాయి. చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా పరిస్థితిని పర్యవేక్షించారు. గుడిసెల తొలగింపు పూర్తయ్యేవరకు పోలీసు పికెట్ ఏర్పాటుచేయాలని ఆదేశించారు.

స్పందన వినతులను సత్వరమే పరిష్కరించండి

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- గిరిజనుల నుంచి 105 అర్జీల స్వీకరణ


గిరిజనుల నుంచి వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇతర అధికారులు

సాక్షి, పాడేరు: స్పందన వినతుల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులు జవాబుదారులుగా ఉండి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆయనతోపాటు జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి గిరిజనుల నుంచి 105 వినతులను స్వీకరించారు.వీటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీసీ వీవీఎస్ శర్మ, గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, ఈఈలు రాజు, కొండయ్యపడాల్, ఐటీడీఏ పరిపాలనాధికారి హేమలత పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- పాడేరు మండలం దేవాపురం పంచాయతీ వి.గదబపూరు నుంచి కుమ్మరిపాలెం,డప్పాడ నుంచి జర్రిగరువు గ్రామం వరకు మిషన్ కనెక్ట్‌లో మంజూరు చేసిన రోడ్ల పనులను వెంటనే పూర్తి చేయాలని సర్పంచ్ కిల్లు పరమేశ్వరి వినతి పత్రం అందజేశారు.
- సలుగు సచివాలయానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని పాడేరు మండలం సలుగు ఎంపీటీసీ మీనా కోరారు.
- హుకుంపేట మండలం జర్రకొండ పంచాయతీ సరియా నుంచి గనిక గ్రామం వరకు గ్రావెల్ రోడ్డు నిర్మించాలని సర్పంచ్ కొర్రా చిట్టిబాబు కోరారు.
- వ్యవసాయ పనులకు గాను పవర్ వీడర్ మంజూరు చేయాలని అరకులోయ మండలం బొండాం పంచాయతీ జయంతివలస గ్రామానికి చెందిన కిల్లో బుజ్జిబాబు కోరారు.
- ముంచంగిపుట్టు మండలం బంగారుమెట్ట పంచాయతీలోని మాలగుమ్మి, శరభపుట్టు, కుజుభంగి, సరియాపల్లి గ్రామాలకు తాగునీటి సదుపాయాలు కల్పించాలని సర్పంచ్ వి.రత్న కలెక్టర్‌ను కోరారు.

గిరి గ్రామాల అభివృద్ధికి కృషి

- చింతపల్లి ఏఎస్పీ ప్రశాంత్ శివకిషోర్
- గాలికొండ పంచాయతీలో సంజీవని వైద్య శిబిరం


రెడ్ క్రాస్ సొసైటీ సామగ్రిని పరిశీలిస్తున్న ప్రశాంత్ శివకిషోర్

సీలేరు: మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం, పోలీసుశాఖ చేస్తున్న కృషిని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని చింతపల్లి ఏఎస్పీ ప్రశాంత్ శివకిషోర్ సూచించారు. మండలంలో మారుమూల మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన గాలికొండ పంచాయతీ పాతునిగుంట గ్రామంలో సంజీవని మెడికల్ క్యాంపు, వాలీబాల్ టోర్నమెంట్ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో పోలీసులు ఎప్పటికప్పుడు తిరుగుతూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. రోడ్లు, వంతెనలు, సెల్ టవర్లు, ఆధార్ కేంద్రాలు, ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు, ఇతరత్రా సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నామన్నారు. ఈనెల 6వ తేదీన చింతపల్లిలో టాటా టెక్నాలజీ కంపెనీ సహకారంతో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువత ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మావోయిస్టులకు ఎవరూ భయపడొద్దని, వారికి సహకరించొద్దన్నారు. ఈ ప్రాంతాలు వారి కారణంగానే అభివద్ధి చెందలేదన్నారు. గిరిజనులకు ఆయన రగ్గులు పంపిణీ చేశారు. వైద్యశిబిరంలో 360 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. క్రీడాకారులకు వాలీబాల్ పోటీలను నిర్వహించి క్రీడా సామగ్రి అందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ తరపున గిరిజనులకు దోమ తెరలు, ఇతర వస్తువులు పంపిణీ చేపట్టి రెండు వేల మందికి భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐలు అప్పల సూరి, రామకృష్ణ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయండి


సమావేశంలో తహసీల్దార్ నర్సమ్మను నిలదీస్తున్న వైస్ ఎంపీపీ సత్యనారాయణ

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ప్రభుత్వ భూముల్లో జోరుగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వాటిని ఆపాలని, ప్రజాప్రతినిధులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఎంపీపీ అరిసెల సీతమ్మ, సభ్యులు రెవెన్యూ అధికారుల తీరుపై పడ్డారు. మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. శాఖల వారీగా మండల స్థాయి అధికారులు జరుగుతున్న పలు అభివృద్ధి పనులను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సీతమ్మ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మాట్లాడుతూ ముంచంగిపుట్టు మండల కేంద్రంలో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయిందని, ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని, రక్షణ కల్పించాలని తహసీల్దార్ నర్సమ్మను సభ్యులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడడం, గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనుల్లో ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ, జీసీసీ, ఎన్ఆర్ఈజీఎస్, పిఆర్, ఐసీడీఎస్, ఆర్అండ్‌బీ, నాడు-నేడు పనులకు సంబంధించిన శాఖలపై సభలో వాడి వేడి చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ సీతమ్మ మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులను కచ్చితంగా స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలకు తెలియజేయాలన్నారు. అభివృద్ధి పనులపై పర్యవేక్షణ నిరంతరం చేయాలని, మండల కేంద్రంలో అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ భూములు పరిరక్షించాలన్నారు. రానున్న సమావేశానికి కచ్చితంగా అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కావాలన్నారు. వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, భాగ్యవతి, ఎంపీడీవో కిరణ్‌కుమార్, ఏవో శ్రీనివాస్‌బాబు, జీసీసీ మేనేజర్ మోహన్, పీఆర్ ఏఈఈ గోపాలకృష్ణ, ఎస్ఐ రవీంద్ర, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి


గుడివాడ వీధిలో కమ్యూనిటి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

పాడేరు : గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి స్పష్టం చేశారు. పట్టణంలోని గుడివాడ వీధిలో రూ.23లక్షలతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమానంగా నిధులు కేటాయిస్తోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించలేదని, దీంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. గిరిజనులకు మేలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. గిరిజనాభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి గిరిజనులు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, పాడేరు మేజర్ పంచాయతీ సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, పాడేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, పార్టీ పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు గబ్బాడ చిట్టిబాబు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వనుగు బసవన్నదొర, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ ఎం.సరస్వతి, వైస్ ఎంపీపీ గంగపూజరి శివకుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

తొలిరోజు సూపర్‌హిట్

ఆహ్లాదకర వాతావరణం.. భారీగా హాజరైన అభిమానులు.. ఆపై మైదానంలో మన ఆటగాళ్ల జోరు.. మొత్తంగా భారత్, ఇంగ్లండ్ రెండో టెస్ట్ మ్యాచ్ తొలిరోజు అభిమానుల అంచనాలకు తగినట్లుగా సరైన వినోదాన్ని పంచింది. యశస్వి చక్కటి షాట్లతో అందరినీ అలరించాడు. రోహిత్ ఔటైనప్పుడు నిశ్శబ్దం కనిపించింది. లోకల్ ప్లేయర్ భరత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఏసీఏ ప్రత్యేక ఏర్పాట్లతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరలివచ్చారు. పెవిలియన్ ఎండ్స్, ఇటు మీడియా బాక్స్ దరి స్టాండ్స్ నుంచి అభిమానుల హర్షాతిరేకాలతో స్టేడియం దద్దరిల్లింది. – విశాఖ స్పోర్ట్స్

- భారత్, ఇంగ్లండ్ టెస్ట్ మ్యాచ్‌కు పోటెత్తిన అభిమానులు
- క్యూకట్టిన విద్యార్థులు
- కేరింతలతో హోరెత్తిన స్టేడియం



స్టేడియంలో ప్రేక్షకులు

వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో శుక్రవారం ప్రారంభమైన భారత్- ఇంగ్లండ్ టెస్ట్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు అభిమానులు పోటెత్తారు. కౌంటర్లలో టికెట్ల విక్రయాలు పెద్ద ఎత్తున జరిగాయి. ఇంగ్లండ్ అభిమానులు సైతం లైన్లలో నిల్చొని మరీ ప్రవేశం పొందారు. రెండు వేల మంది విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పిస్తామని ముందుగానే ఏసీఏ ప్రకటించడంతో.. ఉదయం 8 గంటల నుంచే విద్యార్థులు క్యూ కట్టారు. వీరందరినీ స్టేడియంలోని 'కె'స్టాండ్ లోయర్ టైర్‌లో అనుమతించారు. కొందరు స్టేడియం బయటే ఉండిపోగా.. వారిని కూడా అప్పర్ టైర్‌లోకి అనుమతించారు. ఏసీఏ అనుబంధ క్లబ్‌ల ఔత్సాహిక క్రికెటర్లకు స్టేడియం సౌత్ బ్లాక్‌లోని సీ, డీ స్టాండ్స్‌లోకి ప్రవేశం కల్పించారు. ఈ సందర్భంగా ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ తొలిరోజు మ్యాచ్‌కు అనుకున్న దాని కంటే ఎక్కువ మంది అభిమానులు తరలివచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు, అనుబంధ క్లబ్‌ల ఔత్సాహిక ఆటగాళ్లకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం స్టేడియంలో పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేసిందని వెల్లడించారు. థర్డ్ పార్టీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టామన్నారు. ఎక్కువ మంది అభిమానులు రావడంతో ఫుడ్ విషయంలో కాస్త ఆలస్యం అయిందని, గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దుతామన్నారు.

స్టేడియంలో ముచ్చటగా మూడోసారి

ఇక్కడ జరిగిన టెస్ట్ మ్యాచ్‌ల్లో భాగంగా ఆతిథ్య భారత్ జట్టు ముచ్చటగా మూడోసారి టాస్ గెలిచింది. ఇక్కడ తొలిసారిగా ఇంగ్లాండ్ జట్టుతో జరిగిన టెస్ట్‌లో టాస్ గెలిచిన భారత్ రెండు రోజుల్లోనే ఆటను ముగించేసి శుభారంభం చేసింది. దక్షిణాఫ్రికా జట్టుతో జరిగిన మ్యాచ్‌లోనూ టాస్ గెలిచి రెండో ఇన్నింగ్స్‌ను పూర్తిగా ఆడకుండానే డిక్లేర్స్ చేసి విజయకేతనం ఎగురవేసింది. మరోసారి ఇంగ్లాండ్‌తో జరుగుతున్న టెస్ట్‌లోనూ టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత్ తొలిరోజు ఆధిక్యాన్ని ప్రదర్శించింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్ తొలిరోజు ఆట తొలి బంతి నుంచి చివరి బంతి వరకూ క్రీజ్‌లో నిలవడంతో అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. లోకల్ బాయ్ భరత్ కేవలం 23 బంతులే ఆడి వెనుతిరగడంతో అభిమానుల్లో కాస్త నిరాశ కనిపించింది. ఈ స్టేడియంలో ఇంగ్లండ్ తరపున షోయబ్ బషీర్, భారత్ తరపున రజత్ పటీదార్ అరంగేట్రం చేశారు. షోయబ్ తన తొలి వికెట్‌గా భారత్ కెప్టెన్ రోహిత్‌ను పెవిలియన్ దారి పట్టించాడు. పటీదార్ నిలకడగా రాణించినా అర్ధసెంచరీ నమోదు చేయలేకపోయాడు.


క్రికెట్ అభిమానుల కోలాహలం


షాట్ కొడుతున్న భరత్

అలలపై తేలియాడే వంతెన!

బీచ్‌రోడ్డు(విశాఖ) : ఆర్.కె.బీచ్‌లో సముద్రంలో తేలియాడే వంతెన సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. విక్టరీ ఎట్ సీ ఎదురుగా ఉన్న తీరం వద్ద హై-డెన్సిటీ పాలిథిలిన్(హెచ్‌డీపీఈ) బ్లాక్స్‌ను ఒకదానికి మరొకటి జత చేస్తున్నారు. వంతెన నిర్మాణం పూర్తి చేసి.. త్వరలోనే సందర్శకులకు అనుమతిస్తామని నిర్వాహకులు వెల్లడించారు.

లేగదూడల సంరక్షణతోనే పశు సంపద వృద్ధి

బుచ్చెయ్యపేట: లేగ దూడల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ చూపి సంరక్షించినపుడే పశు సంపద వృద్ధి చెందుతుందని పశు సంవర్ధకశాఖ ఈడీ బి. రామ్మోహనరావు తెలిపారు. కొమ్మళ్లపూడిలో విశాఖ డెయిరీ కేంద్రం వద్ద జిల్లా పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శనను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చాలా మంది రైతులు లేగ దూడలకు సరిపడినంతగా పాలు, పోషకాలు అందించకపోవడం వల్ల పుట్టిన రెండు, మూడు నెలల్లోనే మృతి చెందుతున్నాయని చెప్పారు. మరికొంత మంది రైతులు వాటి పెంపకంపై శ్రద్ధ చూపకపోవడంతో అనారోగ్యానికి గురవుతున్నట్టు చెప్పారు. లేగదూడల పెంపకంపై శ్రద్ధ చూపితే రైతులకు ఆదాయంతో పాటు పశు సంపద పెరుగుతుందన్నారు. లింగనిర్ధారిత వీర్యం ద్వారా ఆడ పెయ్యిలు ఎక్కువగా పుడతాయని తెలిపారు. ఈ ప్రదర్శనలో పలు గ్రామాల నుంచి తీసుకొచ్చిన 52 లేగ దూడలు పాల్గొనగా, సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్న మొదటి మూడు లేగదూడలకు చెందిన రైతులకు బహుమతులు అందజేశారు. పీడీ పాలెంకు చెందిన కరణం అప్పారావు లేగ దూడకు మొదటి బహుమతి, కొమ్మళ్లపూడికి చెందిన గేదెల సత్యనారాయణ లేగ దూడకు రెండవ బహుమతి, పొట్టిదొరపాలెంకు చెందిన గుద్దేటి కోటి వరహాలకు చెందిన లేగ దూడకు మూడవ బహుమతి అందజేశారు. విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వడ్డాది ప్రభుత్వ ఆస్పత్రి పశువైద్యాధికారి శివకుమార్ రైతు సంఘం నాయకులు వేపాడ మధు, ఈశ్వరరావు, నాగేంద్ర, హరికృష్ణ పాల్గొన్నారు.